# 35

# యేసు ఐదు వేల మందికి ఆహారము పెట్టుట

## (14:13-21)

యేసు జనసమూహములకు ఆహారము పెట్టుట, ఏ కార్యమునైనను చేయుటకు ఆయనకు అసాధ్యము కాదని తెలియజెప్పుచున్నది. ఇది వాస్తవమని ఆయన శిష్యులు అప్పటికే చాలినంత నిదర్శనము చూచినప్పటికిని, అప్పుడప్పుడు వారు యింకను సందేహించుచుండిరి. అది అధిగమింపబడజాలనిదని వారు చూచిన ఒక ఆటంకమును, అది దేవుని శక్తిని మరియు ఆయన ప్రజల యెడల కలిగియున్న ప్రేమను ప్రదర్శించుటకు ఒక చక్కని సదవకాశమని యేసు గమనించాడు.

### యేసు ఏకాంతమునకు వెళ్లుట (14:13, 14)

**13యేసు ఆ సంగతి విని దోనె యెక్కి, అక్కడనుండి అరణ్యప్రదేశమునకు ఏకాంతముగా వెళ్లెను. జనసమూహములు ఆ సంగతి విని, పట్టణములనుండి కాలినడకను ఆయనవెంట వెళ్లిరి. 14ఆయన వచ్చి ఆ గొప్ప సమూహమును చూచి, వారిమీద కనికరపడి, వారిలో రోగులైనవారిని స్వస్థపరచెను.**

**వచనము 13.** ఈ సమయంలో, యోహాను మరణము గూర్చిన గత సంఘటన (14:3–12) నుండి యేసు పరిచర్యకు ఒక మధ్యంతరము కలుగజేసికొనబడినది. ఈ చారిత్రక క్రమవారి వచనముల సంబంధము అస్పష్టముగా నున్నది. NASBలో ఈ వచనం, **యేసు యోహాను గూర్చి వినినప్పుడు** అను మాటలతో మొదలగుచున్నది. “యోహాను గూర్చి” అను మాటలు గ్రీకు గ్రంథపాఠములో అగుపించుట లేదు, కానీ అవి అనువాదకుల చేత చేర్చబడినవి. ఈ చేర్చుడము సరైనదైనట్లయితే, మిగిలిన అధ్యాయమంతా కూడ గత సంఘటన యొక్క ఆకస్మిక జ్ఞాపకమే ఔతోంది. హేరోదు యేసును గూర్చి వినినవివరమును నిర్ధరించుకొనక మునుపే యోహాను శిరచ్ఛేదనము జరిగిపోయినది (14:1, 2). యేసు ఏకాంతముగా వెళ్ళుట, ఆయన యోహాను మరణము గూర్చి వినిన దుఃఖపూరితమైన వార్తకు ఒక సూటియైన ప్రతియైస్పందనయై యుండును.

యేసు, మృతులలో నుండి లేచిన యోహానై యున్నాడని హేరోదు నమ్మిన సందర్భములో (14:1, 2) యేసు యోహాను మరణ వార్త విన్నాడని మత్తయి పేర్కొనుట కూడ సాధ్యమే. గ్రంథపాఠమును గూర్చిన ఈ అవగాహన, గత సంఘటన గూర్చిన జ్ఞాపక వృత్తార్థమును 14:3–12నకు పరిమితము చేయును. యేసు ఏకాంతమునకు వెళ్లుట, ఆయన గూర్చి హేరోదు పలికిన వాంగ్మూలమునకు ఒక ప్రతిస్పందనయై యున్నదని కూడ అది సూచించును. మార్కు 6వ అధ్యాయమును మరియు లూకా 9వ అధ్యాయమును పోల్చి చూచినట్లయితే, తిథివారి ఈ అనువాదము సరైనదే అని తెలియును. ఇంకా,

యేసు ఏకాంతమునకు వెళ్లుట గూర్చి మార్కు మరియు లూకా మరొక విషయమును తెలియజెప్పుచున్నారు: వారికప్పగింపబడిన పరిమితమైన అధికారముతో కూడిన కార్యభారమును నెరవేర్చిన తదుపరి పన్నెండు మంది అపొస్తలులు తిరిగి వచ్చారనియు, వారికి విశ్రాంతి అవసరమై యుండినదనియు చెప్పుచున్నారు (మార్కు 6:30, 31; లూకా 9:10).

దీనికి ముందటి అధ్యాయం ప్రకారం, యేసు తన స్వస్థలమైన నజరేతులో పరిచర్య చేయుచుండెను (13:54–58). తన పరిచర్యను కొనసాగించుటకు ఆయన గలిలయ సముద్ర తీరమునకు తిరిగి వచ్చాడు. ఆయనను గూర్చి హేరోదు కలిగియుండిన దృక్పథము గూర్చి వినినప్పుడు, **యేసు దోనె యెక్కి, అక్కడ నుండి అరణ్య ప్రదేశమునకు ఏకాంతముగా** వెళ్లెను. "యేసు తానే" అను మాటలు (NASB) ఆయనతో కూడ ఉండిన శిష్యులను మినహాయించుట లేదు (మార్కు 6:31, 32; లూకా 9:10). "ఏకాంత స్థలము" అను మాటలు గ్రీకు పదజాలమునకు (*erēmon topon*) అనువాదమై యున్నవి. ఎవరూ నివసించని స్థలమునకు యేసు వెళ్లుచుండెను, కానీ అచ్చట ఉండిన విస్తారమైన పచ్చిక గూర్చి పేర్కొనబడుటను గమనించినట్లయితే అదొక "అరణ్యప్రదేశము" కాదని తెలియుచున్నది (14:19; మార్కు 6:39)

లూకా వ్రాసిన సువార్త ప్రకారము, యేసు మరియు ఆయన శిష్యులు బేత్సయిదా వైపు వెళ్లారు (లూకా 9:10). ఏదిఏమైనా, మార్కు వ్రాసిన సువార్త ప్రకారము, జనసమూహములకు అద్భుతకరముగా ఆహారము పెట్టబడిన తరువాత యేసు తన శిష్యులను "అద్దరి నున్న బేత్సయిదాకు ముందగా వెళ్లుడని" వారిని పంపించాడు (మార్కు 6:45). యేసు కాలములో, "చేపలుపట్టు ఇల్లు" లేక "జాలరుల ఇల్లు" అని అర్థమిచ్చు పేరుతో ఒకటి కంటె ఎక్కువ పట్టణములు పిలువబడుచుండెను కాబోలు. లూకా వ్రాసిన సువార్తలో పేర్కొనబడిన బేత్సయిదా గలిలయ సముద్రమునకు ఈశాన్యమున ఉండియుండును, అయితే మార్కు సూచించుచున్న బేత్సయిదా వాయవ్య దిశలో కపెర్నహూమునకు సమీపములో ఉండియుండును (యోహాను 6:17). బేత్సయిదా (జూలియస్), యొర్దాను నది గలిలయ సముద్రములో ప్రవేశించు చోట ఉత్తరమున నుండిన తీరములో నున్న స్థలమని జోసీఫస్ గుర్తించాడు.[1]

ఈ బేత్సయిదా చతుర్థాధిపతియైన ఫిలిప్పు పరిపాలించుచుండిన ప్రాంతములో ఉండినది గనుక కొంతమేరకు హేరోదు ముట్టడికి గురికాకుండినదై యుండును.[2] యేసు అచ్చట అగుపించుచుండిన అపాయము నుండి ఉద్దేశపూర్వకముగానే వెళ్లిపోయినను, ఆయన భయపడినందునుబట్టి వెళ్లిపోలేదు. అధ్యాయం ముగింపుకు వచ్చేసరికి, ఆయన గలిలయలోని గెన్నేసరెతు ప్రాంతమునకు వచ్చినట్లు చూడనగును (14:34), అప్పటికి ఆ ప్రాంతము హేరోదు అధీనములో ఉండినది.

యేసు తన బృహత్కార్యభారమేమై యుండినదో నిశితముగా ఎరిగినవాడై, సకాలములో ఆయన దానంతటిని సాధించునని తెలిసినవాడై యుండెను. మరొక సందర్భములో, హేరోదు ఆయనను చంపజూచుచున్నాడని కొందరు పరిసయ్యులు ద్వారా యేసునకు సమాచారము అందించబడినది (లూకా 13:31). అప్పుడు యేసు, "మీరు వెళ్లి ఆ నక్కతో ఈలాగు చెప్పుడు, 'ఇదిగో, నేడును రేపును నేను దయ్యములను వెళ్లగొట్టుచు [రోగులను]

స్వస్థపరచుచునుండి మూడవ దినమున పూర్ణసిద్ధి పొందెదనని' " చెప్పి వారిని పంపించాడు (లూకా 13:32). పొంచియుండిన ఆయన మరణము గూర్చి, యెరూషలేములో సంభవింపనై యుండిన సంఘటన గూర్చి (లూకా 13:33), ఇదొక సుస్పష్టమైన ముందు సూచనయై యుండినది.

యేసు దోనె యెక్కి అక్కడనుండి సముద్రపు ఆవలి తీరమునకు వెళ్లుచున్నాడని **జనసమూహములు తెలిసికొనినప్పుడు, వారు పట్టణముల నుండి ఉత్తర తీరము వెంబడి కాలినడకను ఆయన వెంట వెళ్లిరి**. వారు "రోగుల యెడల ఆయన చేసిన సూచకక్రియలను చూచినందునుబట్టి" (యోహాను 6:2) ఆయన వెంబడి వెళ్లిరి. ఈ ప్రజలు యేసు నొద్దకు చేరుటకు ఎంతటి ఆటంకమునైనా అధిగించుటకు ఇష్టపూర్వకముగా సిద్ధపడినవారై యుండిరి.

**వచనము 14.** దోనె ఒడ్డు చేరుకొన్న తరువాత, యేసు **తీరమునకు వచ్చినప్పుడు** అచ్చట కూడుకొని యుండిన **గొప్ప జనసమూహమును** ఆయన ఎదుర్కొన్నాడు. కనీసము వారిలో కొందరైనా ఆయన అచ్చోటికి చేరుకొనక మునుపే చేరియుందురు. యేసు వారి మీద **కనికరపడ్డాడు** (9:36; 15:32; 20:34 చూడు). "వారు కాపరిలేని గొర్రెల వలె ఉన్నందున" యేసు హృదయం కనికరముతో కరిగిపోయింది (మార్కు 6:34). ఆయన యెదలో యెదిగిన సహానుభూతికి ఫలితంగా, ఆయన **వారిలో రోగులైనవారిని స్వస్థపరచెను.**

## యేసు జనసమూహములకు ఆహారము పెట్టుట (14:15-21)

**15సాయంకాలమైనప్పుడు శిష్యులాయనయొద్దకు వచ్చి-ఇది అరణ్యప్రదేశము, ఇప్పటికే ప్రొద్దుపోయెను, ఈ జనులు గ్రామములలోనికి వెళ్లి భోజనపదార్థములు కొనుక్కొనుటకై వారిని పంపివేయమని చెప్పిరి. 16యేసు-వారు వెళ్లనక్కరలేదు, మీరే వారికి భోజనము పెట్టుడని వారితో చెప్పగా 17-18వారు-ఇక్కడ మనయొద్ద అయిదు రొట్టెలును రెండు చేపలును తప్ప మరేమియు లేదని ఆయనతో చెప్పిరి అందుకాయన-వాటిని నాయొద్దకు తెండని చెప్పి 19పచ్చికమీద కూర్చుండుడని జనులకాజ్ఞాపించి, ఆ అయిదు రొట్టెలను రెండు చేపలను పట్టుకొని ఆకాశమువైపు కన్నులెత్తి ఆశీర్వదించి ఆ రొట్టెలు విరిచి శిష్యులకిచ్చెను, శిష్యులు జనులకు వడ్డించిరి. 20వారందరు తిని తృప్తిపొందిన తరువాత మిగిలిన ముక్కలు పండ్రెండు గంపల నిండ ఎత్తిరి 21స్త్రీలును పిల్లలును గాక తినినవారు ఇంచుమించు అయిదువేలమంది పురుషులు.**

యేసు ఐదు వేల మందిపురుషులకు ఐదు రొట్టెలు మరియు రెండు చేపలతో ఆహారము పెట్టుట, నాలుగు సువార్తలలోను వ్రాయబడి యున్న ఒకే ఒక్క అద్భుతకార్యమై యున్నది (14:15-21; మార్కు 6:35-44; లూకా 9:12-17; యోహాను 6:5-14). సువార్తల రచయితలకు ఈ సంఘటన ఎంత ప్రాముఖ్యమైనదై యుండినదో ఈ విషయము సూచించుచున్నది. నాలుగు వేల మంది పురుషులకు ఆహారము పెట్టుట మత్తయి మరియు మార్కు వ్రాసిన సువార్తలలో మాత్రమే కలదు (15:32-39; మార్కు 8:1-9).

మెస్సీయ సంబంధిత యుగము గూర్చిన యూదుల సాంప్రదాయమొకటి, అద్భుతకరమైన

రొట్టెలతో ప్రజలకు ఆహారము పెట్టబడునని ఎదురుచూచినది.[3] రొట్టెలను వృద్ధిపొందించుట ద్వారా, మోషే ద్వారా పలుకబడిన ప్రవక్త ఆయనే అయియున్నాడని యేసు ప్రదర్శించాడు (ద్వితీయోపదేశకాండము 18:15, 18; యోహాను 6:14). మోషే దినములలో, దేవుడు అరణ్యములో తన ప్రజలకు ఆకాశము నుండి కురిపింపబడిన రొట్టెను అనగా మన్నాను, ఆహారముగా సమకూర్చాడు (నిర్గమకాండము 16:1-36).[4] యేసు జనసమూహములకు శరీరముల నిమిత్తమైన ఆహారమును (రొట్టెను) మాత్రమే సమకూర్చలేదు, కానీ ఆయన ఆధ్యాత్మిక జీవాహారముగా పరలోకము నుండి దిగి వచ్చాడు. ఈ ఇతివృత్తము యోహాను సువార్తలో వ్రాయబడియున్నట్లు, యేసు చేసిన సుదీర్ఘ ప్రసంగము ద్వారా ఉపదేశింపబడినది (యోహాను 6:26-59).

రొట్టెలు మరియు చేపలు ఆది సంఘముల దేవాలయములలోని నగిషీ కళాఖండములో తరుచుగా కనిపించుచుండును. ఆ నాటి క్రైస్తవులు యేసు చేసిన అద్భుతకార్యములలో ఆసక్తి కలిగియుండిరి ఏలయనగా దేవుడు తన ప్రజలకు తన అరణ్యములో మన్నాను కురిపించుట ద్వారా ఆహారము పెట్టాడు, మరియు వారు యుగాంతమందలి మెస్సీయా సంబంధిత విందు కొరకు ఎదురుచూచుచుండిరి (ప్రకటన 2:17 చూడు).[5]

**వచనము 15.** యేసు మొదట్లోనే అనుకొన్న ప్రకారము తన శిష్యులతో కూడ విశ్రాంతి తీసికొనుటకు బదులుగా, ఆయన ఆ రోజును రోగులను స్వస్థపరచుటయందును, జనసమూహములకు బోధించుట యందును గడిపాడు (14:14; మార్కు 6:34). **సాయంకాలమైనప్పుడు**, యేసు ఆ జనసమూహములకు వారి ఇళ్లకు పంపివేయవలెనని **శిష్యులు** చెప్పారు. వారు కూడుకొని యుండిన **స్థలము నిర్మానుష్యమైనది**, అనగా ఎవరూ నివసించని చోటై యుండినది (14:13పై గల వ్యాఖ్యానము చూడు). ఇంకా, సాయంకాల భోజన **సమయము** కూడ దాటిపోయినది. **జనసమూహములు తమ కొరకు ఆహారమును కొనవలెనంటే** ప్రయాణమై వెవ్వేరు **గ్రామాలకు** వెళ్లవలసి యుండినది. ఈ ప్రజలందరి గూర్చి శిష్యులలో చెలరేగుచుండిన ఆందోళన యథార్థమైనదై యుండినది. ప్రజలంతా ఆహారము, బస మొదలగు వాటి గూర్చి ఎటువంటి ప్రణాళికలు వేసికొనకుండానే, వారితో కూడ ఆహారమేమియు తీసికొనిరాకుండానే బయలుదేరి వచ్చి యేసు వెంట వెళ్లుచుండిరి. అప్పటికి, వారు ఖచ్చితంగా ఆకలిగొనియుందురు. నిస్సందేహముగా శిష్యులు సహితము ఆకలిగొనియుందురు.

**వచనము 16. వారు వెళ్లనక్కర లేదు, మీరే వారికి భోజనము పెట్టుడి** అని యేసు వారితో చెప్పినప్పుడు శిష్యులు ఎంతో నివ్వెరపోయి యుందురు. యోహాను వ్రాసిన సువార్త ప్రకారము, "వీరు భుజించుటకు, ఎక్కడ నుండి రొట్టెలు కొన్ని తెప్పింతుము?" అని యేసు ఫిలిప్పునడిగాడు (6:5). ఈ ప్రశ్నకు వెనువెంటనే ఒక వివరణము కూడ ఇవ్వబడి యున్నది: "యేమి చేయనై యుండెనో తానే యెరిగియుండి, అతనిని పరిక్షీంచుటకు ఆలాగడిగెను" (6:6). అచ్చట కూడుకొని యుండినవారి సంఖ్య ఎంత ఉండవచ్చునో (యోహాను 6:7). మార్కు 6:37 ప్రకారము, "మేము వెళ్లి యిన్నూరు దేనారముల రొట్టెలు కొని వారికి పెట్టుదుమా?" అని శిష్యులు యేసుతో చెప్పారు. ఒక దేనారము, ఒకని దిన కూలికి సమానమై యుండినది (20:2), గనుక రెండు వందల దేనారములు, దాదాపు ఒకని ఎనిమిది నెలల జీతమునకు సరిపడు మొత్తమగును.

ఫిలిప్పు యొక్క ఆందోళన సమర్థింపబడినదై, అతని ఆతురత అర్థంచేసికొనబడినదై యుండగా, యేసుయందలి అతని అల్పవిశ్వాసము క్షంతవ్యముకానిదై యున్నది. ఏ కార్యమైన చేయుటకు యేసుకు అది అసాధ్యమైనదై యుండలేదు. ఈ వాస్తవము గూర్చి ఆయన శిష్యులు అప్పటికే చాలినన్ని రుజువులను కళ్లారా చూచినప్పటికిని, యింకను అపనమ్మకస్థులై యుండిరి. వారు అధిగమింపరాని ఆటంకముగా చూచినదానిని యేసు, దేవుని శక్తిని మరియు ప్రజల యెడల ఆయనకుండిన ప్రేమను ప్రదర్శించుటకు గల ఒక సదవకాశముగా పరిగణించాడు.

**వచనములు 17, 18.** "మీయొద్ద ఎన్ని రొట్టెలున్నవి? పోయి చూడుడి" అని యేసు అపొస్తలుల నడిగాడు (మార్కు 6:38). వారు చూచి తెలిసికొని **ఐదు రొట్టెలును రెండు చేపలు** ఉన్నవని **వారు అయనకు** ప్రత్యుత్తరమిచ్చారు. అందుకు యేసు, **వాటిని ఈ నాయొద్దకు తెండని** చెప్పాడు. "అంద్రెయ, సీమోను పేతురు సహోదరుడు," "అయిదు యవల రొట్టెలు రెండు చిన్న చేపలు" కలిగియుండిన పిల్లవానిని యేసు నొద్దకు తీసికొని వచ్చాడు. ఏదిఏమైనా, అతడు ఫిలిప్పుతో కూడ, "ఇంత మందికి ఇవి ఏమాత్రము?" అంటూ సందేహపూర్వకంగా పలికాడు (యోహాను 6:8, 9).

రొట్టెలు మరియు చేపలు, గలిలయలోని పేదల మౌలిక భోజన పదార్థములై యుండినవి (7:9, 10); ఇవే ఆహారపదార్థములు ఉదయకాల ఉపహారమునకు సహితము అంరీకరింపబడినవి (యోహాను 21:9-13). ఈ సందర్భములో, చిన్నవాని యొద్ద ఉండిన రొట్టెల యవల చేత చేయబడినవై యుండెను (యోహాను 6:9). యవలు, వసంత కాలములో గోధుమలు పండింపబడక మునుపు పండింపబడినవి (రూతు 2:23). అవి గోధమల కంటెను చౌక ధరకు లభించెడి ముతక ధాన్యమై యుండినది (ప్రకటన 6:6), గనుక అవి అత్యధికంగా నిరుపేదలైనవారి చేత ఆహారంగా ఉపయోగింపబడినవి. ఈ "రొట్టెలు" చిన్నవిగాను, గుండ్రముగాను ఉండిన రొట్టెముక్కలై యుండును. చేపలు, బహుశా గలిలయ సముద్రములో పట్టబడిన చిన్న జాతికి చెందినవై యుండను. సమదృక్పథ సువార్తలు (మత్తయి, మార్కు మరియు లూకా) "చేపలు" అని చెప్పుటకు సాధారణమైన మాటను (*ichthus*) ను ఉపయోగించుచుండగా, యోహాను అల్పార్థక పదమును *opsarion* వాడుచున్నాడు. చేపలు, సర్వసాధారణంగా ఉప్పు పూయుట ద్వారా పదిలపర్చబడినవి.

యేసు చేసిన అద్భుతకార్యము ప్రతివారికి ఇష్టమైన భోజన పదార్థములనుగాని, అసాధారణమైన ఫలములనుగాని, ద్రాక్షారసమునుగాని వారికి సమకూర్చలేదు. యేసు వారికి సమకూర్చిన భోజనము, అమితమైన బాధలలో అవసరమగు నిత్యావసరములు సమకూర్చబడుటకు ఆధారపడదగు దేవుని దైవికమైన శ్రద్ధను ఉద్ఘాటించుచున్నది (6:25-34 చూడు). యేసు మెస్సీయాయైనవాడు, ఆయనను వెంబడించువారికి అరణ్యములో సహితము ఆహారమును సమకూర్చునని ఈ సంఘటన తెలియజెప్పుచున్నది.[6]

**వచనము 19. జనులందరు పచ్చిక మీద కూర్చుండవలెనని** యేసు వారికి ఆదేశించాడు. ఈ వ్యవస్థాపక సంబంధిత కార్యభారమును శిష్యులు నిర్వహించారు (లూకా 9:14, 15). "కూర్చుండుడి" (*anaklinō*) అను పదము ఒకడు భోజనము చేయుటకు కూర్చున్నట్లుగా "ఆనుకొని కూర్చుండుడి" అని యింకా ఎక్కువ అక్షరార్థముగా అనువదింపబడవచ్చును (8:11). పచ్చిక, ఆకుపచ్చనిదై యుండెను (మార్కు 6:39), గనుక వసంత కాలము అప్పుడే

మొదలయ్యిందని అది సూచించినది. పస్కా పండుగ సహితము సమీపించియున్నదను వాస్తవముతో ఇది బలపరచబడినది (యోహాను 6:4). ప్రజలు "నూరేసి మంది చొప్పునను ఏబదేసి మంది చొప్పునను పంక్తులు తీరి కూర్చుండిరి" (మార్కు 6:40). "గుంపులు" అని తెలియజెప్పుటకు మార్కు వ్రాసిన సువార్తలో ప్రయోగింపబడిన పదము (*prasiai prasiai*) అక్షరాలా "గుంపులు గుంపులుగా" అర్థమిచ్చుచు, నూరేసి మంది మరియు ఏబదేసి మంది, ఆకు పచ్చని గడ్డికి తారతమ్యముగా ఉండునట్లు ఒక క్రమమైన వరుసలో ఏర్పాటుచేయబడు పూల తోటల వలె కూర్చుండబెట్టబడిరని సూచించుచున్నది.

ప్రజలంతా పచ్చిక మీద కూర్చున్న తరువాత, యేసు భోజన సమయంలో అతిథులను ఆదుకొను ఇంటి యజమాని వలె ప్రవర్తించాడు. ప్రజలందరు చూచుచుండగా, **ఆయన ఆ అయిదు రొట్టెలను రెండు చేపలను పట్టుకొని, ఆకాశము వైపు కన్నులెత్తి ఆశీర్వదించాడు.** ఆకాశము వైపు కన్నులెత్తుట యూదులలో ఒక సామాన్యమైన ప్రార్థనా భంగిమయై యుండినది (కీర్తనలు 121:1; 123:1, 2; 141:8; లూకా 18:13; యోహాను 11:41; 17:1). ఆయన "ఆ రొట్టెలను ఆశీర్వదించాడు" అను మాటలు ఆ ఆహారము కొరకు యేసు, దేవునికి "వందనములు చెల్లించాడు" (NIV) అను సామాన్య అర్థమునిచ్చుచున్నవి. ఆయన ఆ రొట్టెల భౌతిక అంశమును మార్చలేదు; కానీ ఆయన కేవలము దానిని వృద్ధిపొందించాడు. "ఓ మా దేవా, ఈ విశాల విశ్వమును ఏలుచున్న రాజా, భూమిలో నుండి మాకు ఆహారమును దయచేయుచున్నవాడా, నీకు స్తోత్రములు" అను ప్రార్థన, రొట్టెల కొరకు యూదులు పలుకుచుండిన సాంప్రదాయికమైన ఆశీర్వచనమై యుండినది.[7]

రొట్టెలను విరిచి, చేపలను విభజించి (మార్కు 6:41), యేసు వాటిని తన శిష్యులకిచ్చాడు, అప్పుడు శిష్యులు జనసమూహములందరికి వడ్డించారు. ఈ సంఘట వివరింపబడుచున్న విధానము ఒక గమనార్హమైన సంగ్రహమును కలిగియున్నది. రొట్టెలను మరియు చేపలను వృద్ధిపొందించుట గూర్చి వర్ణించుటకు కొన్ని మాటలు మాత్రమే ప్రయోగింపబడినవి. "ఈ సంఘటన అద్భుతకార్యమును అభివ్యక్తము చేయుట కంటె, దానికి బదులుగా దాని ధ్వనింపు నిచ్చుచున్నదని కూడా ఒకరు చెప్పవచ్చును" అని విల్యమ్ హెండ్రిక్సెన్ వ్యాఖ్యానించాడు.[8]

అది బొత్తిగా వేరైన సందర్భములో చెప్పబడినప్పటికిని, భాష ("పట్టుకొని," "ఆశీర్వదించి," "విరిచి," మరియు "ఇచ్చెను") ప్రభు భోజన సంస్కారము వ్యవస్థాపింపబడినప్పుడు గ్రంథస్థం చేయబడిన పదముల వలెనే యున్నది (26:26; మార్కు 14:22; లూకా 22:19; 1 కొరింథీయులకు 11:23, 24). యేసు చేసిన చర్యలు, యూదుల కుటుంబములోని తండ్రి ప్రతి దినము చేసిన చర్యలను మనకు గుర్తుచేయుచున్నవి. ఆ తండ్రి రొట్టెను పట్టుకొని, ఆ ఆహారము కొరకు దేవునికి వందనములు చెల్లించి, దానిని విరిచి, అచ్చట చేరియున్న ప్రతి ఒక్కరు తినుటకు వారికి ఒక్కొక్క ముక్కను ఇచ్చును.[9]

**వచనము 20. వారందరు తిని తృప్తిపొందిరి**. వారందరు తినుటకు చాలినంత ఇవ్వబడుట మాత్రమే కాదు, కానీ వారు తిని సంపూర్ణముగా సంతృప్తిచెందునంతగా వారికి వడ్డింపబడినది. ఒక మంచి అతిథేయుడు తన ఇంటికి వచ్చిన అతిథులు చాలినంత తినుట మాత్రమేకాదు కానీ అందరు భోజనము చేసిన తరువాత యింకా మిగిలియుండుటకు సరిపడునంత భోజనము సమకూర్చుననునది ప్రాచీన మధ్యధరా ప్రాంత ప్రపంచములో

ఒక సామాన్య నమ్మకమై యుండినది.[10] "వారు తృప్తిగా తినిన తరువాత, 'ఏమియు నష్టపడకుండ మిగిలిన ముక్కలు పోగుచేయుడని' ఆయన తన శిష్యులతో చెప్పెను" అని యోహాను 6:12 తెలియజెప్పుచున్నది. **కాబట్టి వారు భుజించిన తరువాత వారి యొద్ద మిగిలిన అయిదు యవల రొట్టెల ముక్కలు పోగుచేసి పండ్రెండు గంపలు నింపిరి.**

ఇచ్చట వాడబడిన "గంపలు" అను పదము (*kophinos*) నాలుగు వేల మందికి ఆహారము పెట్టబడిన సందర్భములో వాడబడిన పదమునకు భిన్నమైనదై యున్నది (15:37). ఇచ్చట ప్రయోగింపబడిన పదము, ఒక యూదుడు ప్రయాణము చేయునప్పుడు మార్గములో అన్యజనుల యొద్ద ఆహారము కొనవలసి అవసరము రాకుండునట్లు, దానిలో రొట్టెలు పెట్టుకొని మోసికొనివెళ్లు చిన్న గంపను సూచించుచున్నది.[11] యేసు నాలుగు వేల మందికి ఆహారము పెట్టిన కథలో "గంపలు" (*spuris*) అని చెప్పుటకు వాడబడిన పదము, ఒక మనిషి పట్టునంత పెద్దదై యున్న గంప, ఉదాహరణ క్రైస్తవులందరు కలిసి పౌలును దమస్కు పట్టణ గోడ మీద నుండి దింపినంత పెద్దదై (అపొస్తలుల కార్యములు 9:25) యుండునను ధ్వనింపు నీయవచ్చును. ఏదిఏమైనా, ఈ పదములలో గల భేదము వాటి కైవారము కంటే, దానికి బదులుగా అవి తయారుచేయబడిన వస్తువునుబట్టి ఉన్నదని లియోన్ మోర్రిస్ తర్కించుచున్నాడు *kophinos*, చాలా గట్టిగా, బహుశా మేదరి పని కొరకు వాడబడు వెదురు బద్దలతో తయారు చేయబడినదాని వలె ఉండునదనియు, *spuris* జనపనారతో లేదా అటువంటి వస్తువుతో తయారుచేయబడినదై మెత్తగాను, ఎక్కువ సులభముగా వంగెడు గుణముగలదనియు అతని వాదనమై యుండినది.[12]

"పండ్రెండు" అను సంఖ్య మనకు ఇశ్రాయేలీయుల పండ్రెండు గోత్రములను మరియు పండ్రెండు మంది అపొస్తలులను గుర్తుచేయుచున్నది. వారి యెదుట నుండిన జనసమూహములు నూతన ఇశ్రాయేలుకు ప్రతినిధులుగా ఉన్నారని భావించుకొనబడువచ్చును. దేవుడు ఇశ్రాయేలీయులకు అరణ్యములో ఆశ్చర్యకరముగా ఆహారము పెట్టినట్లే, యేసు కూడ నూతన ఇశ్రాయేలీయులకు ఏకాంతముగాను. నిర్జనముగాను ఉండిన ఈ స్థలములో ఆహారము పెట్టాడు. అద్భుతకార్యము ద్వారా ఆహారము చాలినంత కంటె ఎక్కువే అందుబాటులో ఉండినదని మిగిలిన ముక్కలు సాక్ష్యము చెప్పుచున్నవి. శిష్యులు మిగిలిన ముక్కలను పోగుచేయునట్లు చూచుట వలన, వారు దేవుని దీవెనలను దుర్వినియోగము చేయకూడదని యేసు తన శిష్యులకు నేర్పించాడు (లూకా 15:13 చూడు).

**వచనము 21. ఆ నాడు అచ్చట కూడుకొని యుండిన జనుల సంఖ్య బహు భారీగా ఉండినది: స్త్రీలును పిల్లలును గాక, తినినవారు ఇంచుమించు అయిదు వేల మంది పురుషులు.** ప్రాచీన కాలములో పురుషులను మాత్రమే లెక్కించుట సర్వసామాన్యమైన సంగతై యుండినది. సంఖ్యాకాండములో, ఇరవై సంవత్సరములు మరియు ఆ పైబడిన వయస్కులైన పురుషులు మాత్రమే–సైన్యములో పోరాడగల సామర్థ్యముగలవారు మాత్రమే–జనాభా లెక్కలలో లెక్కింపబడిరి (సంఖ్యాకాండము 1:2, 3) యేసు ఐదు వేల మంది పురుషులకు ఆహారము పెట్టాడు, ఈ సంఖ్య దాదాపుగా రోమా ప్రభుత్వ సేనకు సమానమై యుండినది. యేసు చేసిన కార్యములు–ఆకలిగొనిన వారికి ఆహారము పెట్టుట మరియు రోగులను స్వస్థపరచుట–యుద్ధమునకు గొప్ప సంపదగా నున్నవని ప్రజలు అనువదించారు.

ఇటువంటి మనస్తత్వముగలవారై, వారు "రాజుగా చేయుటకు వచ్చి ఆయనను బలవంతముగా పట్టుకొనబోయారు" (యోహాను 6:15).

✧✧✧✧✧ **పాఠములు** ✧✧✧✧✧

### యేసు ఐదు వేల మందికి ఆహారము పెట్టుట (14:15–21)

ఐదు వేల మందికి ఆహారము పెట్టబడుట మరియు నాలుగు వేల మందికి ఆహారము పెట్టబడుట, ఈ రెండూ కూడ ఏదో ఒక విధంగా కలుషితము చేయబడిన ఒకే సంఘటనకు సంబంధించిన సంగతులై యున్నవని కొందరు విమర్శనాత్మకమైన విద్వాంసులు సాధికారముతో చెప్పుచుందురు. ఈ రెండు అద్భుతకార్యములను జాగ్రత్తగా అధ్యయనము చేసినట్లయితే ఇది తప్పుడభిప్రాయమని రుజువౌతోంది.

1. *విభిన్న సందర్భములు.* ఈ రెండు అద్భుతకార్యములు చేయబడుటకు మధ్య ఎంత కాలము గడిచిపోయిందో మనము ఖచ్చితంగా చెప్పలేము, కానీ అవి ఖచ్చితంగా వేర్వేరు సందర్భములై యున్నవి. యేసు తన శిష్యులను. "పరిసయ్యులు మరియు సద్దూకయ్యుల పులిసిన పిండిన గూర్చి" హెచ్చరించుచుండినప్పుడు, ఈ రెండు సంఘటనల నడుమ గల వ్యత్యాసమును ఆయన సుస్పష్టముగా తెలియజేసాడు (16:9, 10).

2. *విభిన్న స్థలములు.* ఐదు వేల మందికి ఆహారము పెట్టబడిన కార్యము బేత్సయిదాకు సమీపమున చేయబడినవి (లూకా 9:10) గనుక అచ్చట అత్యధికంగా గలిలయ నుండి వచ్చిన యూదులు చేరియుండిరి. నాలుగు వేల మందికి ఆహారము పెట్టబడిన కార్యము దెకపొలి ప్రాంతములో చేయబడినది (మార్కు 7:31; 8:1–9). ఆ స్థలం అన్యజనులతో నిండియుండినందు వలన, ఇచ్చట అత్యధికంగా యూదేతరులు చేరియుందురు.

3. *విభిన్న కాల వ్యవధులు.* ఐదు వేల మంది యేసుతో కూడ ఒక్క రోజు ఉండిరి (14:15, 23), అయితే నాలుగు వేల మంది ఆయనతో కూడ మూడు దినములుండిరి (15:32).

4. *విభిన్న మొత్తములో నుండిన ఆహారపదార్థములు.* యేసు మొదటి అద్భుతకార్యమును ఐదు యవల రొట్టెలు మరియు రెండు చేపలతో చేసాడు (యోహాను 6:9). రెండవ అద్భుతకార్యము చేయక మునుపు, ఏడు రొట్టెలు మరియు కొన్ని చిన్న చేపలుండినవి (15:34). ఇంకా, అందరు తిని తృప్తిపొందిన తరువాత ఎత్తబడిన మిగిలిన ముక్కల గంపల సంఖ్యలో కూడ ఎంతో తేడాను చూడగలము. మొదటి అద్భుతకార్యము తరువాత, పండ్రెండు గంపల నిండ ఎత్తారు (14:20); కానీ రెండవ అద్భుతకార్యము తరువాత, ఏడు గంపల నిండ ఎత్తారు (15:37).

మత్తయి మరియు మార్కు వ్రాసిన సువార్తలు కూడ ఈ రెండు అద్భుతకార్యములను వర్ణించుచున్నవి. అలాగైతే, ఒకే విషయాన్ని ఇద్దరు రచయితలు ఎందుకు రెండు పర్యాయములు వ్రాస్తారు? ఈ గ్రంథకర్తలు పరిశుద్ధాత్మ చేత నడిపింపబడినందు వలన, వారు ఈ రెండు అద్భుతములను ఒక్కొక్క దాని గూర్చిన సత్యము రచించారు.

*మనమేమి చేయవలెను?* యేసు ఐదు వేల మందికి ఆహారము పెట్టిన సంఘటన నుండి మనము ఏమి నేర్చుకొనగలము? నాలుగు సహేతుకమైన సత్యములు

మీముందుంచబడుచున్నవి. (1) మనము కలిగియున్న వాటిని సద్వినియోగము చేసికొనవలెను. ఐదు రొట్టెలు మరియు రెండు చేపలు ఒక జనసమూహమునకు చాలవు కదా, కానీ అత్యధికంగా గుర్తింపుపొందిన అద్భుతకార్యమును చేయుటకు యేసు ఈ చాలీ-చాలని సమకూర్పునే సద్వినియోగము చేసాడు. (2) అర్పణ నిమిత్తము మనకున్నదానినే ఇచ్చుటకు మనము ఇష్టపడుచుండవలెను. ఇంత కొంచెము ఆహారము ఇంత గొప్ప జనసమూహమునకు ఎలా సరిపోతుందని అంద్రెయ ఆశ్చర్యపడియుండును. దేవుడు ఏ అవసరమునైనా తీర్చగలడు. అర్పించుటకు మన దగ్గర ఏమీ లేదు కదా అని మనము అనుకొన్నప్పుడు, దేవుడు ఏదో ఒక ప్రణాళిక వేయుచుండవచ్చును! విశ్వాసమేనగా, కంటికి కనబడని దానిని చూడగలుగుట, నమ్ముట, మరియు పొందుటకు అసాధ్యమైన దానిని పొందుట. (3) మన ప్రభువు ఇచ్చిన లేదా ఇచ్చుచుండు ఆజ్ఞలను మనము గ్రహించలేకపోయినను మనము వాటికి లోబడుచుండవలెను. ఆ సమయంలో అందుబాటులో నుండిన ఆహారము గూర్చి ఆలోచించుచు, జనసమూహములను పచ్చిక మీద కూర్చుండబెట్టుమని యేసు తన శిష్యులకు ఆదేశము లిచ్చినప్పుడు వారు ఇదొక వింతగా ఉన్నదే! అని అనుకొని యుందురు. అసాధ్యమైనదని మన దృష్టికి అగుపించునది దేవుని ద్వారా సాధ్యమౌతోంది.

(4) మనకనుగ్రహింపబడు ఆశీర్వాదములను మనము వృథాచేయకూడదు. మిగిలిన ముక్కలన్నియు ఎత్తబడినవి. ఏది కూడ పారవేయబడలేదు. విషయములను పదిలపరచవలసిన అవసరత గూర్చి మన ప్రభువే ఆలోచించుచున్నట్లయితే, మనము కూడ ఆలోచించవలసిన అవసరం లేదా?

**మామూలు విషయము యొక్క మహిమ (14:17)**

అవి మామూలు విషయాలే అని మనము ఎంచుచుండు విషయములను ఉపయోగించుట ద్వారా దేవుడు ఆయన కొరకు గొప్ప మహిమ కలుగజేసికొనగలడు, నిర్గమకాండములో, ఐగుప్తు మీద తెగుళ్లను కలుగజేయుటకు, ఎర్ర సముద్రమును పాయలు చేయుటకు, ఆయన ప్రజలకు విడుదల కలుగజేయుటకు, దేవుడు మోషే చేతిలో ఉండిన మామూలు కర్రను ఉపయోగించాడు (నిర్గమకాండము 4:1-3; 7:17; 8:5, 16; 9:23; 10:13; 14:16). న్యాయాధిపతుల గ్రంథంలో, మిద్యానీయుల భారీ దండును ఓడించుటకు ఆయన మూడు వందల మంది ఇశ్రాయేలీయుల చేతుల్లో ఉండిన సామాన్యమైన బూరలను, కుండలను, మరియు దివిటీలను దేవుడు ఉపయోగించాడు (న్యాయాధిపతులు 7:16, 22).

సువార్తలలో, యేసు ఒక మామూలు మనిషి మధ్యాహ్న భోజనమును ఒక గొప్ప జనసమూహమునకు చాలినంత ఆహారము పెట్టుటకు ఉపయోగించాడు (14:17; యోహాను 6:9). దేవుని మహిమ కొరకు ఉపయోగింపబడగల వస్తువు/విషయము-క్రీస్తు ఉపయోగించుటకు, అవి ఆయనకు అందుబాటులో ఉండునట్లు మనము వాటిని ఆయనకు ఇష్టపూర్వకంగా ఇచ్చుచున్నామా?

దేవిడ్ స్టూవర్ట్

## సూచనలు

[1]Josephus *Antiquities* 18.2.1; *Wars* 2.9.1; 3.10.7; *Life 72.* [2]Robert H. Mounce, *Matthew*, New Internatioal Biblical Commentary (Peabody, Mass.: Hendrickson Publishers, 1991), 142. [3]*2 Baruch 29.8.* [4]యేసు ఐదు వేల మందికి ఆహారము పెట్టిన సంఘటనకు పాత నిబంధనలో గల ఇతర సమానాంతరములలో దేవుడు ఏలియాకు ఆహారము సమకూర్చిన విషయము (1 రాజుల 17:9–16) మరియు ఏలీషా వంద మందికి ఆహారము పెట్టిన విషయము కలవు (2 రాజులు 4:42–44). [5]Leon Morris, *The Gospel according to Matthew,* Pillar Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1992), 375. [6]Douglas R. A. Hare, *Matthew*, Interpretation (Louisville: John Knox Press, 1993), 166. [7]Mishnah *Berakoth* 6.1. [8]William Hendriksen, *New Testament Commentary: Exposition of the Gospel According to Matthew* (Grand Rapids, Mich.: Baker Book House, 1973), 596. [9]David Hill, *The Gospel of Matthew*, The New Century Bible Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1972), 246. [10]Craig S. Keener, *A Commentary on the Gospel of Matthew* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1999), 405; Plutarch *Moralia* 279E; 702D-704B చూడు.

[11]Juvenal *Satires* 3.14; 6.542; Mishnah *Sotah* 2.1 చూడు. [12]Leon Morris, *The Gospel According to John,* The New International Commentary on the New Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1971), 345, n. 25.